

## మద్యపానం నిషేధిస్తూ బిల్కల్ గ్రామస్తుల తీర్మానం

మర్పల్లి, జూన్ 22 : మండలంలోని బిల్కల్ గ్రామంలో గ్రామస్థులు మద్యపానం నిషేధిస్తున్నట్లు ఆదివారం తీర్మానం చేశారు. గ్రామస్తులు అందరూ సమావేశం ఏర్పాటు చేసుకొని గ్రామంలో బెల్ట్ షాపులు నడుపరాదని పంచాయతీ కార్యదర్శి రాకేశ్ సమక్షంలో తీర్మానం చేశారు.. బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలు జోరుగా సాగుతుండటంతో ప్రజల జీవితాలు నాశనం అవుతున్నాయని, ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలిపారు. గ్రామంలో ఎవరూ మద్యం విక్రయించకూడదని, ఒకవేళ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## ఉపాధి, శిక్షణ అందించడం అభినందనీయం





సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ ఎత్తిపోతల సలహాదారు పెంటారెడ్డి, శిక్షణ పూర్తి చేసుకున్న వారితో శ్రీ సత్య సాయి సమితి సభ్యులు

ధారూరు, జూన్ 22: శ్రీ సత్య సాయి గ్రామీణ సార్వజనిక కేంద్రం కేరెల్లిలో నలభై ఐదు రోజులుగా నిర్వహిస్తున్న టైలరింగ్ శిక్షణ ఆదివారం ముగిసింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కేరెల్లి గ్రామ వాస్తవ్యుడు తెలంగాణ రాష్ట్ర ఎత్తిపోతల సలహాదారు కె. పెంటా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి సేవా సంస్థలు చేసే సేవల కొనియాడారు. గ్రామాల్లో టైలరింగ్ వంటి ఉపాధి శిక్షణ అందించడం విద్యార్థి విద్యార్థులకు మానవతా విలువలను బోధించడం సంస్థ ద్వారా ఎంతో మంది యువతీ యువకులు సక్రమమైన మార్గం లో నడుచుకునే విధంగా ఈ సంస్థలు దోహదపడుతున్నాయని తెలియజేశారు కార్యక్రమంలో కేరెల్లి మాజీ సర్పంచ్ కె. నర్సింహారెడ్డి, కె సోమిరెడ్డి, శ్రీ సత్య సాయి గ్రామీణ సార్వజనిక కేంద్రం అధ్యక్షులు బి. రఘునందన్, ప్రధాన కార్యదర్శి ఎం ప్రేమ్‌కుమార్, సత్యసాయి సేవా సమితి, కేరెల్లి కన్వీనర్ కే రామ కృష్ణారెడ్డి, మాదారం కన్వీనర్ శ్రీ నాగరాజు, రంగాపూర్ సేవకేంద్రం వ్యవస్థాపకులు వెంకట్ రెడ్డి, సేవాదళ్ సభ్యులు శేకేరరెడ్డి యాదయ్య, చెన్నయ్య, రవికుమార్, నర్సింలు రాజేందర్ రెడ్డి, సాయి, రామ్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సంజీవరెడ్డి, ఇంద్రారెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, బలవంత్ రెడ్డి, శశిదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో లో వోల్టేజీ సమస్యకు పరిష్కారం



బొంరాస్‌పేట, జూన్ 22: దుద్యాల మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలోని తెలుగు వాడలో లో వోల్టేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామంలో అన్ని కాలనీలలో విద్యుత్ సరఫరా ఉన్నా తెలుగువాడలో మాత్రం విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఉండడంతో అనేకసార్లు విద్యుత్ అధికారులకు విన్నవించగా అధికారులు స్పందించి తెలుగు వాడకు నూతనంగా ఒక ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్‌స్తంభాలను ఏర్పాటు చేశారు. దీంతో తెలుగువాడలో విద్యుత్ సమస్య తీరడంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లైన్‌మెన్ వెంకట్ రాములు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## ముదిరాజ్ బహిరంగ సభను విజయవంతం చేయాలి




సమావేశంలో మాట్లాడుతున్న లగచర్ల సురేశ్ ముదిరాజ్

బొంరాస్ పేట, జూన్ 22 : కొడంగల్ నియోజకవర్గంలో జూలైలో నిర్వహించనున్న ముదిరాజ్ బహిరంగ సభను విజయవంతం చేయాలని లగచర్ల సురేశ్ ముదిరాజ్ కోరారు. రాష్ట్ర ముదిరాజ్ సంఘం అధ్యక్షులు జగన్మోహన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ముదిరాజ్ సమావేశంలో తెలంగాణ ముదిరాజ్ సంఘం నిర్ణయం మేరకు కొడంగల్ నియోజకవర్గంలో ముదిరాజ్ సామాజిక వర్గ ప్రజలతో ఏర్పాటు చేయనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జగన్ మోహన్, స్టేట్ జనరల్ సెక్రెటరీ వెంకటయ్య, చండీ ముదిరాజ్ మత్స్య కార సంఘం అధ్యక్షురాలు కోట్ల పుష్పలత, ఓయూ జేఏసీ నాయకులు భీమసేన్, కొడంగల్ ముదిరాజ్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి రైతుకూ 11 నంబర్లతో యూనికోడ్

వికారాబాద్, జూన్22. ఆధార్ తో దేశంలోని ప్రతి పౌరునికి గుర్తింపు ఇచ్చినట్లుగానే ప్రతి రైతుకు 11 నెంబర్లతో విశిష్ట సంఖ్య(యూనికోడ్) ని కేటాయించాలని కేంద్రం నిర్ణయించిందని మండల వ్యవసాయ అధికారి ప్రసన్న లక్ష్మీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ ప్రాజెక్టును చేపడుతున్నామన్నారు. భూమి ఉన్న ప్రతి రైతు తనకు ఉన్న భూములకు సంబంధించిన వివ రాలతో కూడిన సమాచారంతో ఈ ఫార్మర్ రిజిస్ట్రీ నిర్మించబడుతుందన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశాల మేరకు గ్రామా లలోని రైతులకు యూనికోడ్ ప్రక్రియను ముమ్మరంగా జరుగుతుం దన్నారు. రెవెన్యూ శాఖ ద్వారా సేకరించిన భూ యాజమాన్య వివరాలను రైతు ఆధార్ సంఖ్యను అనుసంధానం చేయడం ద్వారా ఈ ఫార్మ ర్ ఐడీని కేటాయించన్నుట్లు తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు ఏ రకమైన చట్టబద్ధ యాజమాన్య హక్కును కల్పించదని,కేవలం రెవెన్యూ శాఖ వద్ద ఉన్న భూ యాజమాన్య వివరాలను ప్రామాణికంగా తీసుకొని ఈ రైతులకు ఫార్మర్ ఐడీ కేటాయించనున్నట్లు తెలిపారు.కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ అను సంధానం చేయడం జరుగుతుందన్నారు. పీ ఎంకిసాన్ లబ్ధిదారులకు తదుపరి విడత లబ్ధి పొందుటకు ప్రామాణికంగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు తప్పనిసరి చేస్తూ కేంద్రం మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంబంధిచిన పథకాలు అయిన రైతు భరోసా రుణమాఫీ తదితర రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ఫార్మర్ రిజిస్ట్రీకి ఏ రకమైన సంబంధం లేదన్నారు. రైతు విశిష్ట సంఖ్యను (ఫార్మర్ ఐడీ) పొందుటకు రైతు ఆధార్, భూ యాజమాన్య పాస్ పుస్తకం ఆధార్‌కు లింక్ చేయబడిన మొబైల్ నెంబరు తీసుకొని వ్యవసాయ అధికారి లేదా వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని ఆమె వివరించారు.

## ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీ ఎన్నిక



యాలాల, జూన్, 22: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి గ్రామంలోను కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆదివారం మండల పరిధిలోని దేవనూరు గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జూలై 7న ఎమ్మార్పీ ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఎగరవేయాలన్నారు. 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటంలో మందకృష్ణ మాదిగ అనేక విజ యాలు సాధించడం జరిగిందన్నారు. దేవనూరు గ్రామంలో నూతనంగా ఎన్నికైన ఎమ్మార్పీ ఎస్ గ్రామ కమిటీని అభినందించి శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు. గ్రామంలో ఎమ్మా ర్పీఎస్ బలోపేతానికి నూతన కమిటీ అహర్నిశలు కృషి చేస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మెట్టి కృష్ణ, నర్సింహులు నరేందర్ పాల్గొన్నారు.

## డిఫెన్స్ మద్యం స్వాధీనం నలుగురి అరెస్ట్

వికారాబాద్, జూన్, 22: హర్యానా ప్రాంతానికి చెందిన 20 డిఫెన్స్ మద్యం బాటిళ్లను హైదరాబాద్‌కు తీసుకొని వస్తుండగా రంగారెడ్డి ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం పట్టుకున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ ఆర్ కిషన్ ఆదివారం తెలిపారు. ఒక కారులో డిఫెన్స్ మద్యం వస్తుందనే సమాచారం మేరకు ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుభాష్ చంద్ర, ఇతర సిబ్బంది కలిసి వికారాబాద్ సమీపంలోని ఎన్నపల్లి ఎక్స్ రోడ్ వద్ద తనిఖీలు చేపట్టి కారును స్వాధీనం చేసుకున్నారు. కారులో ఉన్నటువంటి 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని, కారులో ఉన్న శ్రీనాథ్‌రెడ్డి, జీవన్ రెడ్డి, అన్వే ష్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

## సంపులో పడి ప్రభుత్వ ఉద్యోగి మృతి

బడంగ్‌పేట్, జూన్ 22: ఓ ప్రభుత్వ ఉద్యోగి అనుమానాస్పద స్థితిలో సంపులో పడి మృతి చెందాడు. ఈ సంఘటన మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. సీఐ నాగరాజు కథనం ప్రకారం.. సాయి ప్రభు హోమ్స్ కాలనీలో వెంకటేశ్వర్‌రావు(59) కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఇతను పే అకౌంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య జయంతి, కుమారుడు భరత్ రాజు, కూతురు ఉన్నారు. కొంతకాలంగా కుటుంబ గొడవలు జరుగుతున్నట్లు సమాచారం. కాగా.. ఆదివారం మధ్యాహ్నం 12.40 గంటల సమయంలో వెంకటేశ్వర రావు.. ఇంటి వాటర్ సంపులో పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే సంపులో నుంచి బయటకు తీసి.. వనస్థలిపురం ఏరియా దవాఖానకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రాణం తీసిన ఫొటో షూట్..

### షూట్ చేస్తుండగా క్వారీగుంతలో పడి బాలుడు మృతి

శంషాబాద్ రూరల్, జూన్ 22 : స్నేహితులతో ఫొటోషూట్‌కు వెళ్లిన బాలుడు ప్రమాదవశాత్తు క్వారీ గుంతలో పడి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ బాలరాజు వివరాల ప్రకారం.. నగరంలోని బోరబండ ప్రాంతానికి చెందిన మీర్జా షోయిబ్ బేగ్(17) ఇంటర్మీడియట్ చదువుతున్నాడు.

ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో మీర్జా షోయిబ్ బేగ్.. మరో10 మందితో కలిసి క్రికెట్ ఆడడం కోసం వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి ఫొటోషూట్ కోసం కొత్వాల్‌గూడ రెవెన్యూ పరిధిలోని క్వారీ గుంతల వద్దకు వెళ్లాడు. షూట్ చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటిగుంతలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో అతడు నీటిలో మునిగిపోయాడు. గమనించిన తోటి విద్యార్థులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న ఆర్‌జీఐఏ పోలీసులు అగ్నిమాపక, డీఆర్‌ఎఫ్ బృందాలకు సమాచారం ఇచ్చారు. గజ ఈతగాళ్ల సహకారంతో నీటిలో మునిగిన బాలుడిని సాయం త్రం 6 గంటల సమయంలో బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా ఇన్‌చార్జి సతీశ్

వికారాబాద్, జూన్ 22: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జాబ్ క్యాలండర్ విడుదల చేసి, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా ఇన్‌చార్జి సతీష్ డిమాండ్ చేశారు. ఆదివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో సీఐటీయూ కార్యాలయంలో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్యా జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం ఎరుకల సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు అన్నారు. 10కోట్ల ఉద్యోగాలు వెంటనే ఇవ్వాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాం ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు అన్నారు.. నాలుగు లక్షల ఉద్యోగాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. యువ వికాసంలో ఒక్కొకరికి రూ.10లక్షల చొప్పున లోన్లు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు పటేల్ వెంకట్ రాంరెడ్డి, వెంకటయ్య, యాదయ్య, లాలయ్య, కిషన్, శంకర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఆందోళన చేస్తున్న వివిధ పార్టీల నాయకులు

కులకచర్ల, జూన్ 22: పుట్టపహాడ్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేస్తూ దళిత సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో పరిగి-మహబూబ్‌నగర్ రోడ్డు పై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ నిర్మాత విగ్రహాన్ని ధ్వంసం చేయడం సిగ్గు చేటని అన్నారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కులకచర్ల ఎస్సై రమేశ్ కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో కులకచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, దళిత యువశక్తి యువజన సంఘం అధ్యక్షుడు, బ్లాక్ బీ అధ్యక్షుడు భరత్ కుమార్, ప్రజాసంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు, అంబేద్కర్ అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మద్యం తాగి 329 మంది పట్టుబడ్డారు..



సిటీబ్యూరో, జూన్ 22 (నమస్తే తెలంగాణ): సైబరాబాద్ పోలీసులు శనివారం రాత్రి నిర్వహించిన డ్రంక్ అండ్ తనిఖీల్లో 329మంది మందుబాబులు పట్టుపడ్డారు. పట్టుబడిన వాహనదారుల్లో 248 మంది ద్విచక్రవాహనదారులు, 23 మంది త్రి చక్రవాహనదారులు, 54మంది నాలుగు చక్రాల వాహనదారులు, నలుగురు భారీ వాహనదారులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా బ్రీత్ ఎనలైజర్ పరీక్షల్లో బీఏసీ రేంజింగ్ 35ఎంజీ/100ఎంఎల్ నుంచి 200ఎంజీ/100ఎంఎల్ మధ్యన 283మందికి, 200ఎంజీ/100ఎంఎల్ నుంచి 300ఎంజీ/100ఎంఎల్ మధ్య 37మందికి, 301ఎంజీ/100ఎంఎల్ నుంచి 500ఎంజీ/100ఎంఎల్ మధ్య 9మందికి బీఏసీ రేంజ్ ఉన్నట్లు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. పట్టుబడిన నిందితులందరినీ న్యాయస్థానంలో హాజరు పరిచినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా మద్యం మత్తులో వాహనాలు నడపడం తీవ్రమైన నేరమని, ఈ చర్య వల్ల రోడ్డు ప్రమాదాలతో పాటు ఇతరుల మరణానికి కారణమైతే భారతీయ న్యాయ సన్‌హిత చట్టం 2023, సెక్షన్ 105ప్రకారం హత్యా నేరం కేసు నమోదు చేయడంతో పాటు 10ఏళ్ళ వరకు జైలు శిక్ష పడే అవకాశమున్నట్లు పోలీసులు హెచ్చరిస్తున్నారు.

## స్థానిక ఎన్నికల్లో ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించాలి



పెద్దేముల్, జూన్ 22 : తెలంగాణ స్టేట్ మైనార్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ వాహబ్ ఆధ్వర్యంలో ఆదివారం పెద్దేముల్ గ్రామంలో నూతన మండల కమిటీ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మైనార్టీలకు రాజకీయ చైతన్యం పెంపొందించడంపై విద్య, వైద్య, ఉపాధి రంగాలలో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలన్న అంశాలపై ప్రధానంగా చర్చ జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 14శాతం ముస్లింలు ఉన్నప్పటికి , వారిని రాజకీయ పార్టీలన్నీ కేవలం ఓటు బ్యాంకుగా చూస్తున్నాయని తీవ్రంగా విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఒక ముస్లిం కూడా కేబినెట్‌లో లేక పోవడం తీవ్రంగా ఖండించారు. రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ , సర్పంచ్ ఎన్నికల్లో ముస్లింలకు రిజర్వేషన్‌లు కల్పించాలని, అలాగే కోఆప్షన్ సభ్యులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పెద్దేముల్ కమిటీ ఎన్నుకున్నారు . అధ్యక్షుడుగా అఫ్రోజ్ ఖాన్, జనరల్ సెక్రటరీ మహమ్మద్ మహిమూద్, యూత్‌ప్రెసిడెంట్ రహీమ్, వైస్ ప్రెసిండెంట్ మహమ్మద్‌రఫీక్ ఎన్నికయ్యారు.

## ఉద్యోగంలోనుంచి తీసేశారనే చోరీ చేశాడు..

### స్టీల్స్ కంపెనీలో రూ.46లక్షలు అపహరించిన దొంగ అరెస్ట్

బేగంపేట్ , జూన్ 22: దొంగతనం జరిగిన కొన్ని గంటల్లోనే చోరీకి పాల్పడిన దొంగను బేగంపేట పోలీసులు అరెస్టు చేశారు. గతంలో సంస్థలో పనిచేసిన వ్యక్తే నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేసి, అతడి నుంచి రూ.46లక్షలను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉత్తర మండల డీసీపీ రష్మీ పెరుమాళ్ వివరాలు వెల్లడించారు. బేగంపేట ఠాణా పరిధిలోని పాటిగడ్డ సన్ స్టీల్స్‌లో గతంలో గిరిదారి సింగ్ పనిచేయగా.. పలు కారణాలతో అతన్ని ఉద్యోగంలో నుంచి తొలగించారు. దీన్ని మనసులో పెట్టుకుని అతను అర్ధరాత్రి సన్ స్టీల్స్ కంపెనీ వెనుక వైపు రంధ్రంలో నుంచి అద్దాన్ని ధ్వంసం చేసి .. లోపలికి వెళ్లి లాకర్‌ను పగలగొట్టి అందులో ఉన్న రూ.46లక్షలను అపహరించుకుని పోయాడు. దుకాణ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న బేగంపేట పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాలు ఆధారంగా, మేడ్చల్‌లో ఓ దాబా యజమాని ఇచ్చిన సమాచారం మేరకు బస్సు డ్రైవర్‌కు సమాచారం చేరవేయడంతో ఆదిలాబాద్‌కు చేరుకున్న నిందితుడిని అక్కడి పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం బేగంపేట పోలీసులకు అప్పగించారు. నిందితుడి నుంచి డబ్బును స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించారు.


అపోలో హాస్పిటల్స్, హైదరాబాద్
Apollo HOSPITALS
ప్రఖ్యాత వైద్య నిపుణులు ఇప్పుడు
తాండూరు లో
డా కిరణ్ తేజ వి
MBBS, MD (General Medicine), DM (Cardiology)
కన్సల్టెంట్ - కార్డియాలజీ
25 జూన్'25 | 11:00 AM - 2 PM
శ్రీ మహాలక్ష్మి హాస్పిటల్, M.M. కోర్టు పక్కన.
ఈ సమస్యలు ఏమైనా ఉన్నట్లైతే డాక్టర్ గారిని సంప్రదించండి.
• ఛాతీ నొప్పి • ఛాతీ పై ఒత్తిడి • గొంతు, దవడ, మెడ, పొత్తికడుపు పైభాగం లేదా వీపులో నొప్పి • శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు
• ఇరుకైన రక్త నాళాల వల్ల చేతులు, కాళ్ళలో నొప్పి • అలసట
• చల్లగా చమటలు పట్టడం • అధిక కొలెస్ట్రాల్ • TMT పాజిటివ్
అపాయింట్మెంట్ కొరకు: +91 9533 123 216


## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ



కులకచర్ల, జూన్ 22: పేదలకు ప్రభుత్వం వివిధ రకాలుగా సహాయాన్ని అందిస్తున్నదని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఆదివారం కులకచర్లలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇళ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు తోడ్పడతాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు మంజూరు అయ్యే విధంగా చూస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు, బ్లాక్ బీ అధ్యక్షుడు భరత్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.



కులకచర్ల, జూన్ 22: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలా ఉపయోగ పడుతుందని కులకచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. ఆదివారం కులకచర్ల మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్ నాయక్, వెంకటయ్య గౌడ్, ఆనందం, వివిధ గ్రామాల సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

### రూ.20 లక్షల ఆశచూపి..

## పురోహితుడికి 5.10లక్షల టోకరా

సిటీబ్యూరో, జూన్ 22 (నమస్తే తెలంగాణ): కోవిడ్ రైడర్ పాలసీకి సర్వీస్ ట్యాక్స్ చెల్లించి రూ. 20లక్షలు సొంతం చేసుకోవాలంటూ ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు.. ఓ పురోహితుడికి రూ. 5.10 లక్షలు బురిడీ కొట్టించారు. పోలీసుల వివరాల ప్రకారం.. మల్కాజిగిరికి చెందిన బాధితుడు వృత్తిరీత్యా పురోహితుడు. ఇతనికి పీఎన్‌బీ మెట్‌లైఫ్‌లో ఒక ఇన్సూరెన్స్ పాలసీ ఉంది. ఆ పాలసీకి సంబంధించిన ప్రిమియమ్స్ చెల్లించకపోవడంతో.. 2023 నుంచి ప్రీమియం చెల్లించాలంటూ ఫోన్లు చేస్తున్నారు. ఈ క్రమంలో మే నెలలో కంపెనీ ఎగ్జిక్యూటివ్ అని మాట్లాడుతూ.. కనీం రెండు ప్రిమియంలు చెల్లించండి.. మీరు అప్పటి వరకు చెల్లించిన మొత్తం డబ్బు తిరిగి తీసుకునేందుకు వీలుంటుందంటూ నమ్మించారు. ఇందులో భాగంగా రూ.70వేలు రెండు పాలసీలకు చెల్లించాడు. కొన్ని రోజుల తరువాత సందీప్‌కుమార్, మీనాక్షి ఆరోరా పేర్లతో బాధితుడికి ఫోన్‌చేసిన సైబర్ నేరగాళ్లు.. పీఎన్‌బీ మెట్‌లైఫ్ నుంచి మాట్లాడుతున్నామంటూ చెప్పుకున్నారు. కోవిడ్ సమయంలో కేంద్ర ప్రభుత్వం రూ. 20 లక్షల విలువైన రైడర్ పాలసీని కేటాయించిందని, దానికి సంబంధించిన సర్వీస్ ట్యాక్స్ చెల్లిస్తే మీకు రూ. 20 లక్షలు వచ్చేవిధంగా ప్రాసెస్ ప్రారంభిస్తామంటూ చెప్పారు. అది నిజమని నమ్మిన బాధితుడు వివిధ ట్యాక్స్‌ల పేరుతో దఫ ధపాలుగా రూ. 5.10 లక్షలు చెల్లిస్తూ వెళ్లాడు. ఇంకా డబ్బు చెల్లించాలంటూ నేరగాళ్లు చెబుతుండడంతో దీనిపై అనుమానం వచ్చి ఆరా తీయగా ఇదంతా మోసమని గుర్తించి, రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.


మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962